# ప్రజాధనం రోడ్ల పాలు

• అవసరం లేని చోట ఫుట్‌పాత్‌ల నిర్మాణం • చిరువ్యాపారులకు అడ్డాగా మారుతున్న వైనం • వృథా అవుతున్న ప్రజాధనం

వనస్థలిపురం: బాగున్న రోడ్లకే మళ్లీ సొబగులు, అధ్వాన రోడ్లను అసలు పట్టించుకోరు అనే తీరున జీహెచ్ఎంసీ అధికారులు ప్రవర్తిస్తున్నారు. ఎన్నో శివారు కాలనీలు రోడ్లు, డ్రైనేజీ తదితర సౌకర్యాలు లేక ఏళ్లుగా సమస్యలతో సతమతం అవుతున్నా అటుగా దృష్టిసారించని అధికారులు అవసరం లేనిచోట ఫుట్‌పాత్‌ల నిర్మాణం పేరున ప్రజాధనం వృథా చేస్తున్నారు. వనస్థలిపురంలో పోలీస్‌స్టేషన్ సమీపంలో మసీదు రూటులో కొన్నేళ్ల క్రితం అవసరం లేకున్నా ప్రత్యేక నిధుల పేరుతో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. జన సంచారం అధికంగా లేని ఆ రూటులో ఫుట్‌పాత్‌ల నిర్మాణంపై అప్పట్లోనే స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. వారు భావించినట్లుగానే ఆ ఫుట్‌పాత్‌లు నిరుపయోగంగా మారి చిరువ్యాపారులకు అడ్డాగా మారాయి. కాగా మళ్లీ వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ నుంచి ఎన్జీవోస్ కాలనీ వైపు రోడ్డుకు ఇరువైపులా రూ.80 లక్షలతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. అసలే 60 ఫీట్ల రోడ్డులో రెండు వైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో రోడ్డు మరింత కుంచించుకుపోయి వాహనాల రాకపోకలకు, ఆ రూటులో ఉన్న షాపులకు వచ్చే వినియోగదారుల వాహనాల పార్కింగ్‌కు మరింత సమస్య వచ్చే అవకాశం ఉంది. షాపుల ముందు రోడ్డు తవ్వకాలు చేపట్టడంతో వినియోగదారులు రాలేక తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని వ్యాపారస్తులు వాపోతున్నారు. పనులు కూడా నాసిరకంగా జరుగుతున్నాయని, కమీషన్ల కోసమే అధికారులు అవసరం లేనిచోట ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపడుతూ ప్రజల సొమ్ము వృథా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.


వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్-ఎన్జీవోస్ కాలనీ రోడ్డులో ఫుట్‌పాత్‌ల నిర్మాణం కోసం తవ్విన రోడ్డు


చిరు వ్యాపారులకు అడ్డాగా మారిన మసీదు రోడ్డు ఫుట్‌పాత్

## సింగరేణి గుడిసెలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలి


డీఈకి వినతి పత్రం అందజేస్తున్న మోతీలాల్ నాయక్

సైదాబాద్: సింగరేణి కాలనీ గుడిసెవాసుల ఇళ్లకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సంఘం ప్రతినిధులు, బస్తీ మహిళలతో కలిసి చంపాపేట ట్రాన్స్‌కో డీఈకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి కాలనీ గుడిసెవాలసుకు ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు తదితర గుర్తింపు కార్డులు ఉన్నాయన్నారు. 2005లోనే రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాలతో జీహెచ్ఎంసీ ఇళ్ల నెంబర్లను కేటాయించిందని తెలిపారు. అయితే కోర్టు వివాదం పేరుతో ఇప్పటికీ గుడిసెలకు విద్యుత్‌శాఖ అధికారులు కరెంట్ మీటర్లు మంజూరు చేయడం లేదన్నారు. తప్పని పరిస్థితుల్లో అక్రమ విద్యుత్ వాడుతున్నందున తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు గుడిసెవాసుల పట్ల సానుకూలంగా స్పందించకుంటే సమష్టిగా ఉద్యమిస్తామన్నారు. తమ వినతి పట్ల డీఈ సానుకూలంగా స్పందించారని దశల వారీగా గుడిసెలకు మీటర్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని మోతీలాల్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, గణేష్ నాయక్, దేవానాయక్, మోహన్ నాయక్, శాంతిబాయ్, హుస్సేనీబాయ్ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ ఎస్టీ సెల్ నేతలు

మన్సూరాబాద్: వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని టీపీసీసీ ఎస్టీ సెల్ కార్యదర్శి రమావత్ చందునాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద రైతు రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారురు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని సవాల్ విసిరిన మాజీ మంత్రి హరీష్‌రావు తన మాటను నిలబెట్టుకోవాలన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైన బుద్ధి తెచ్చుకుని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ గాంధీనాయక్, నాయకులు శ్రీనివాస్, గణేష్‌నాయక్, రాజ్‌సీతారాంనాయక్, రఘునాయక్, రమేష్‌నాయక్, చందునాయక్, నగేష్‌నాయక్, సిద్ధు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


విద్యార్థి నాయకులుగా ఎంపికైన విద్యార్థులు

హస్తినాపురం: విద్యార్థి దశనుండే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని నీతి నిజాయితీకి మారుపేరుగా అందరికి ఆదర్శంగా నిలవాలని రవీంద్ర భారతి స్కూలు ప్రిన్సిపాల్ బ్యూలా అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ జిల్లా పరిషత్ రోడ్డులోని రవీంద్ర భారతి స్కూల్‌లో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాజకీయ నాయకులకు నిజాయితీ, క్రమశిక్షణ ఎంతో అవసరమని నేటి తరం రాజకీయ నాయకులు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో నాయకులుగా ఎంపికైన చిన్నారులకు పతకాలను అందజేశారు. అనంతరం విద్యార్థి నాయకుడితో (ఎస్‌పీఎల్) ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీబాయి, డీఐ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు కృషి చేయాలి


సమావేశంలో పాల్గొన్న చైతన్యపురి కాలనీవాసులు



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, కాలనీలు, తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్తచెదారం వేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత కాలనీవాసులదేనన్నారు. కాలనీల్లో దోమల నివారణకోసం మందులు పిచికారీ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సతీష్‌గౌడ్, నర్సింహ్మా, గంధం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

చైతన్యపురి: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చైతన్యపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లె కృష్ణమూర్తి అన్నారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం, కాలనీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్లలోని ఆహార వ్యర్థాలను రోడ్లపై వేయవద్దని, చెత్త ఆటో కార్మికులకు అందజేయాలన్నారు. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయటం వల్ల దోమలు వ్యాప్తి చెంది అనారోగ్య బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పూల కుండీలు, పాతవస్తువులలో వర్షపు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసి సిబ్బంది రత్న, గణేష్ రెడ్డి, ఇందిర, సంఘం ప్రధాన కార్యదర్శి జువ్వాది రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరి ఎస్‌పి శాస్త్రి, కాలనీవాసులు ఏవి చెన్నయ్య, పార్థసారధి, శివయ్య, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్ అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తిలేదని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె సాయినగర్ నాలా వద్ద రూ.6.70 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నాలా పరిసరాల్లో వర్షపు నీరు నిల్వకుండా సీసీ రోడ్డు వేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహ, దినేష్, ఉదయ్, సంతోష్, సిద్దు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

### సత్కారం



మన్సూరాబాద్: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కిడి శివచరణ్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

### వీల్‌చైర్‌ల అందజేత

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీయుద్దీన్ అన్నారు. శుక్రవారం డివిజన్ ఎంఐఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన దివ్యాంగులకు వీల్‌చైర్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరికి ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వీల్‌చైర్‌లు అందజేసిన షఫీయుద్దీన్

## రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం


సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ఆర్, తీగల కృష్ణారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం రుణ మాఫీ చేశామని మాజీ ఎమ్మెల్యేలు కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కిచన్నగారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజాపాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పున్న గణేష్, పిట్ట హరినాథ్ రెడ్డి బండి మధుసూదన్ రావు, జ్ఞానేశ్వర్ యాదవ్, కిరణ్, రమేష్ నేత, అక్బర్, లింగుస్వామి గౌడ్, దుబ్బాక శేఖర్, రాజు నాయక్,శేఖర్ ముదిరాజ్, కళ్యాణ్, పెదపూరసైదులు, మహేందర్, నబీ, శ్రీశైలం, శ్రీకాంత్ రెడ్డి సలీం, పాషా, షఫీ, పటేల్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి


ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయురాలు పద్మిని

సైదాబాద్: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని శ్రీసాయినగర్ అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు పద్మిని అన్నారు. పూర్వ ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఐఎస్‌సదన్ డివిజన్ శ్రీసాయినగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో సిబ్బంది బస్తీ మహిళలు, చిన్నారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్తీలోని ఇంటింటికి వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకతను వివరించారు. శ్రీసాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల చదువుకు, ఆటపాటలకు అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్ చంద్రకళ, సహాయకురాలు సక్కుబాయ్ పాల్గొన్నారు.

## అప్రమత్తతతోనే వ్యాధుల నియంత్రణ

మాట్లాడుతున్న కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్



నాగోలు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొత్తపేట డివిజన్ సమతా పురి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ మాట్లాడుతూ వర్షా కాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెత్తా చెదారం బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోలోనే వేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు మాధవ్ రెడ్డి, నర్మద, జవాన్ లక్ష్మయ్య కాలనీ అధ్యక్షుడు రవీందర్ రావు, నరేందర్ రెడ్డి, బబ్లూ, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలి

లింగోజిగూడ: పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించడంతో పాటు 50శాతం పీఆర్‌సీ, ఫిట్మెంట్‌ను ప్రకటించాలని పీఆర్‌టీయూటీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కన్నయగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీఆర్‌టీయూటిఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఓ నెం 11,12లను సవరించి బీఈడీ విద్యా అర్హత కలిగిని వారికి పీఎస్‌హెచ్ఎం పోస్టులు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 5డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ గౌరవ అధ్యక్షులు కొండాపల్లి నారాయణగౌడ్, కర్మన్‌ఘాట్, రాజీవ్‌గాంధీనగర్, సరూర్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## శాకంబరి అలంకారంలో అమ్మవారి దర్శనం


శాకంబరీ అలంకరణలో విజయదుర్గ అమ్మవారు

సైదాబాద్: సైదాబాద్ మాతామైదాన్‌లో కొలువైన విజయదుర్గామాత అమ్మవారు శుక్రవారం శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈనెల 28న అమ్మవారికి విశేషంగా నిర్వహించే ఆషాఢ మాస బోనాల మహోత్సవాలు పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 25 రకాల కూరగాయలు, ఆకుకూరలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ప్రత్యేక అలంకరణను చూసేందుకు భక్తులు తెల్లవారుఝాము నుండే ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

### దుర్గాదేవి ఆలయంలో..

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో ఆషాఢ మాస మహోత్సవాల్లో బాగంగా శుక్రవారం దుర్గాదేవిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, కేశవులు, రమణమూర్తి, మురళీ పాల్గొన్నారు.


శాకంబరీగా దుర్గాదేవి

### నేటినుంచి సురభి నాటకోత్సవాలు

వనస్థలిపురం: శ్రీ వినాయక నాట్యమండలి (సురభి) వారిచే వనస్థలిపురం హుడా ఆడిటోరియం గ్రౌండ్ లోని సురభి థియేటర్‌లో శని, ఆది వారాల్లో సాయంత్రం 6.30 గంటలకు శ్రీ శ్రీనివాస కల్యాణం పౌరాణిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు వేణుగోపాలరావు తెలిపారు. ఈ నాటక ప్రదర్శనలకు ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, కోరా లక్ష్మీ, సంగీత నాటక అకాడమీ పూర్వ చైర్మన్ శివకుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు.

### ప్రగతి చక్ర పురస్కారాల ప్రదానం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపోలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి డిపోమేనేజర్ హరి ప్రగతి చక్ర పురస్కారాలు, అవార్డులు ప్రదానం చేశారు. శుక్రవారం డిపో ఆవరణలో సిబ్బందికి క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఎం మాట్లాడుతూ విధులతో పాటు, మానసిక ప్రశాంతతకు క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎస్. వెంకన్న, డిపో సిబ్బంది లలిత, జీఎస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శృతి, మదన్, ఎంవిఎన్ రావు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

### 8వ వేతన సవరణ చేపట్టాలి

మన్సూరాబాద్: కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ పిలుపు మేరకు జీఎస్ఐ ఎంప్లాయిస్ అసోసియేషన్, సివిల్ అకౌంట్ ఉద్యోగులు, పోస్టల్ ఉద్యోగులు జీఎస్ఐలోని ప్రధాన కార్యాలయం ఎదుట శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ 8వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. 18 నెలల కరువుభత్యం వెంటనే చెల్లించాలని, పూర్తి పెన్షన్‌ను 15 సంవత్సరాలకు బదులుగా 12 ఏళ్లకు కుదించాలని కోరారు. కారుణ్య నియామకాల్లో 5శాతం పరిమితి తొలగించాలని, అన్ని విభాగాల్లోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జీఎస్ఐటీఐ చైర్మన్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సాయిబాబ, కన్ఫడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రసూల్‌ఖాన్, మహేష్, రమేష్, శ్రీకాంత్‌రావు, అమీర్‌ఖాన్, శంకర్‌సింఘ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

ఎల్‌బీనగర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న చేపట్టిన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ ఎల్‌బీనగర్ అధ్యక్షులు అరుణ్ స్టాలిన్ అన్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లో చలో కలెక్టరేట్ ముట్టడి పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హామీలకే పరిమితం కాకుండా వెంటనే నిధులను విడుదల చేయాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేరికల మీద పెట్టిన శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టాలన్నారు. కార్యక్రమంలో పవన్‌యాదవ్, శ్రీకాంత్, నవీన్, ఉదయ్, సురేష్, సాయి, శివ, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

### కత్తి పద్మారావు జన్మదినోత్సవ సభ పోస్టర్ అవిష్కరణ

ఎల్‌బీనగర్: దళితోద్యమ నిర్మాత, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కత్తి పద్మారావు 71వ జన్మదినోత్సవ సభ పోస్టర్‌ను శుక్రవారం వనస్థలిపురంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ గ్రహిత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పద్మారావు జన్మదినోత్సవాన్ని కులనిర్మూలన దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కోయి కోటేశ్వర్, ప్రముఖ కవి కొమ్మవరపు, మదర్ థేరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు చేవూరి శంకర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రైతురుణ మాఫీ సంబరాలు

మలక్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతురుణ మాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మహమ్మద్ సోహేల్ ఉద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. మలక్‌పేటలో రైతులకు స్వీట్లు పంచిపెట్టారు. 'థ్యాంక్యూ రేవంత్ అన్న' అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సోహేల్ ఉద్దీన్ మాట్లాడుతూ.. రూ. 2లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

నాగోలు: రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను శుక్రవారం ఎల్‌బీనగర్ బీసీ సంక్షేమ నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్దపూర బ్రహ్మయ్య మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతిగా, బీసీ కార్పొరేషన్‌లో రుణాలు, సబ్సిడీలు మంజూరు చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో బీసీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ సేవలు ఎనలేనివి

నాగోలు: బండ్లగూడ ఆర్టీసీ డిపో అభివృద్ధిలో మేనేజర్ రమేష్ పాత్ర ఎంతో ఉందని పలువురు ఉద్యోగులు అన్నారు. శుక్రవారం ఆర్టీసీ బండ్లగూడ డిపో మేనేజర్‌గా పనిచేసి రమేష్ బదిలీపై ఫలక్‌నామా డిపోకు వెళ్తున్న ఆయనను శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్టీసీ బండ్లగూడ డిపో మేనేజర్‌గా వెంకటేషం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో అసిసెంట్ మేనేజర్ షాలిని, వెంకటేశర్ల, వీకే రెడ్డి, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

### బండ్లగూడ సర్వేనెంబర్ 58 వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడ సర్వే నెంబర్-58లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మేడ్చల్ (మల్కాజ్‌గిరి) అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సర్వేనెంబర్ 58లో గతంలో కొందరికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని మిగతా వారికి కూడా త్వరగా పట్టాలు ఇవ్వాలని కోరారు. ఫతుల్లగూడలో బతుకమ్మ కుంటను ఏర్పాటు చేయాలని కోరారు. జేసీ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్, పంగా శ్యామ్ కుమార్, ప్రభాకర్ గౌడ్ ,నరేందర్ రెడ్డి, అనితా తదితరులు పాల్గొన్నారు.